# వేరేలోకపు స్వగతాల్లో

## I

### అస్తిత్వవేదన

సచ్చిదానందం నుండి సాహిత్య సమాలోచనా సంకలనం వచ్చింది. సంగీత కచేరీ ఆసాంతం వినమని రేడియోలో. కడపటి జుగల్బబందీ హెచ్చరిస్తున్నది. సీసాలో సార్బిట్రేట్ మాత్రలు నిండుకొన్నవని దృశ్యం చెబుతున్నది. గదినిండా నిశ్శబ్దపు తుపాను.

ఇంతలోనే ఏ దిశనుండో సాధుమధురస్వరంలో ఏవో ప్రాచీన సుగంధ కెరటాలతో ఒక ప్రశ్న. ఒక మానవీయ ఆందోళన - "ఎవరికీ గుండె జబ్బు మాత్రలు?" ఏ ఊర్ధ్వలోకాల నిర్మల సరోవర తీరాల్లోనో యోగనిద్రలో వున్న నిత్య పితరులెవ్వరో ఈ భూలోక వారసుడి క్షేమం గురించి కలత చెందుతున్నారా? ఎందుకీ బోధివృక్షపు కరుణతో నరలోకపు వాసనల్లో చిక్కుకొంటున్నారు? మీకు ధర్మోదకాలు వదలని గోత్రీకులం. మీ సాంవత్సరీకాలను మరచిన వారసులం. మీకు వర్ధంతులు లేవు. మీకు జయంతులు రావు. అయినా మీరు ఫలవృక్షాలుగా నిత్య శిలా ప్రహారాలతో గాయపడి అలసిపోయినా నీడనివ్వక ముడుచుకోరేం? పళ్లనివ్వమని పవ్వళించరేం?

పుస్తకంలో పుటల రెపరెప. కథకుణ్ణిగదా - ఆ ప్రకరణం తెరిచాను. ప్రథమ శీర్షికే ఇది - "కథను నమ్ము. కథకుణ్ణి గాదు". ఎక్కడో ఏదో జీవనరం, ఎక్కడో ఏదో ప్రాణనాడి కలక్కుమన్నది.

జ్ఞానమూ, జ్ఞానదాతా, జ్ఞాన గ్రహీతా - ఈ మూడూ ఒకటికావా? నా వాక్కు మనస్సు నందు ప్రతిష్టితమగుగాక! నా మనస్సు వాక్కునందు ప్రతిష్టత మగుగాక! నా మనోవాక్కులు వేదవాహికలగు గాక! ఈ ఉపనిషత్ సూక్తులు అసంబద్ధమైనవా? ఆ-లయాన్విత గాంధర్వరాగం, పొరలు పొరలుగా పేర్చుకొన్న ఆ ఆనందపల్లవం - చడీ చప్పుడు లేకుండా స్థంభించి పోయింది. వేరేదో నీలిమేఘం నా చుట్టూ కమ్ముకొస్తున్నది. ఒడలు చల్లబడి, వాంతి అయి ఏ ఆప్తుల ఆక్రందనో- 'సార్బిట్రేట్, సార్బిట్రేట్'కు-సడిలేని జడిలేని జవాబులో, ఇంకొక కాలరేఖపైన, ఒక ప్రశాంత ప్రవాహంలో ఆకార శూన్యమైన

పడవలో, గమ్యం గురించిన ఆలోచనలు లేని నేపథ్య గానం ఆలకిస్తూ ఎక్కడికో పయనం. అచ్చట ఎన్నెన్నో భాషలు, దుఃబ్రయత్ర, దుఃబ్రయత్ర. కృపయాతత్రగచ్ఛతు. సఫర్ అజ్‌నాట్ టు మాక్ అవర్ సెల్వ్ విత్ ఫాల్స్ హుడ్. చెదరు చెదరుగా క్షణిక రాగాలు. ఎవరికీ చిరునామా ఇచ్చి రాలేదు. నో సత్-నో చిత్- నో ఆనంద్. నో సంగీతకచేరి. నో సాహిత్య సమాలోచనం. సార్బ్రెటేట్...నో...నో! అన్నిటికీ అతీతం.

ఈ లోకంలో నీలం వేరు, నక్షత్రాలు వేరు. నా పడవ చుట్టూ ఎందరెందరో పూర్వపు ఆప్తులు, శత్రులు, శప్తులు, స్వార్థులు, పవిత్రులు, దాతలు, రాక్షసులు, మనుషులు. మనీషులు. ఇందరి చరిత్రలు రాయలేను. ప్రయాణపు నీరసం. మా బామ్మకు మా అమ్మకు నమస్కరిస్తున్నాను - భాష చాలక. నా జీవితపు ఆది అనుభూతుల్లో, మధ్యలో, అంతంలో నాతో ఎంతో కొంత స్నేహాన్ని పెంచిన సామాన్యుల్ని ఎంచుకొని కథ పొడిగిస్తున్నాను.

## II

### బరూచా-పార్శీ పెద్దమనిషి

1947లో బొంబాయికి బదిలీ అయినప్పుడు, నా వసతి సమస్య అంతసులభంగా పరిష్కారమవుతుందని వూహించలేదు. "నాతోరా - నీకో గది చూపుతాను. నచ్చితే చేరిపో" అని విశాఖ క్రిష్టాఫర్ భరోసా యిచ్చాడు.

గది ఒక మోస్తరుగా పెద్దదే. ఒక మంచం, మేజాబల్ల, రెండు కుర్చీలు, గోడకు అద్దం. చిన్న బాత్‌రూం. కాని - అది ఒక చిన్న బొగ్గుల డిపో ఆవరణలో డాబా మీద ఉన్నది. బొగ్గు రాశుల పక్కగా పది అడుగులు నడిస్తే మెట్లు. యజమాని పేరు బరూచా. పార్శీల్లో గూడా పేద వర్గపు సంసారాలుంటాయని నా కొతని పరిచయంతో అర్థమయింది. యజమాని మంచివాడు. ఒంటరివాడు. బట్టతల. చెదిరిపోని చిరుహాసం. ఏ విషయంలోనూ అతడి నుండి వత్తిడి లేదు. అద్దె మొదటి వారంలో చెల్లించటం ఒక్కటే షరతు. ఒక విధంగా మా యిరువురి మధ్యా నిర్లిప్త స్నేహం కుదిరింది. రెండవ శనివారం నాకు సెలవు గనక తను కొంచెం వూపిరి పీల్చుకొని బొగ్గుల అమ్మకం పని నాకు అప్పజెప్పినా నేను కించపడలేదు. దాదాపు తొమ్మిది పదినెలలు గడిచాయి. ఆ చుట్టుపక్కల జౌళి మిల్లుల కార్మికులే ఎక్కువగా బొగ్గు కొనేందుకు వచ్చేవారు. అంతా చిన్న చిన్న బేరంకిందే లెక్క.

బరూచా వాళ్ల చెల్లెలు సుస్తీగా వుందని తాళాలు నాకప్పగించి సాయంత్రం లోపే వస్తానని ఆ మధ్యాహ్నం కొలాబా వెళ్లాడు. మరాఠీ ముసలమ్మలకు నేను బొగ్గును

పారతో దోకి తూచి యిస్తున్నాను. ఖాకీ పాత ప్యాంటులో వున్నాను. పారకు లోహపు కడ్డీ లాంటిది తగిలి తూకం హెచ్చుతగ్గులు కావటం కన్పించింది. ఆ కడ్డీని తొలగించి ముసలమ్మను పంపివేశాను.

ఆ కడ్డీ బరువుగా వుంది. చూస్తే తుప్పులేదు. ఏవో మరకలూ, బొగ్గు నల్లమసి అలముకొని వున్నవి. పరీక్షగా చూచాను. అది నిజానికి బంగారపు కడ్డీ.

1946లో బొంబాయిలో ఒక హార్బరులో పెద్ద పేలుడు సంభవించింది. చాలా పెద్ద విధ్వంసం. హార్బరులో రెండు మందుగుండు సామాగ్రి నౌకలు నిలిచివున్నాయి. వాటి సరసనే ఒక బంగారు (బులియన్) టన్నులు మోసుకొచ్చిన నౌక. ఎట్లా సంభవించిందో అగ్ని ప్రమాదం. మందుగుండు పేలి ఆకాశమంతా ప్రజ్వలితమైంది. ఆ అగ్నిప్రమాదం బులియన్ నౌకనూ పేల్చి వేసింది. నిప్పు తునకలు మూడు మైళ్ల దూరం గూడా ఎగిరిపోయినాయి. ఇనపవూచలూ, బంగారు కడ్డీలు, బాంబుల తునకలూ ఎగిరెగిరి పయనించాయి. బంగారు ముద్దలు దొరికిన వాళ్లు కొందరు ధనవంతు లయినారని కూడా విన్నాను. బహుశః బొగ్గుల్లో లోతుగా కూరుకు పోయినా ఈ కడ్డీగూడా బంగారమేనని నాకు తోచింది.

బరూచా తిరిగి వచ్చాక డబ్బు లెక్కయిచ్చేసి, అక్కడొక కడ్డీ అడ్డంగా వున్నదని చెప్పి స్నానం చేసేందుకు డాబామీదకు వెళ్లిపోయాను. ఒక అరగంట తర్వాత బరూచా నా తలుపుతట్టి కొంచెం తడబడుతూ చెప్పాడు. ఆ కడ్డీ రాగిది. నేనే బొగ్గుల్లో దాచాను.

అతను అబద్ధం ఆడుతున్నాడని నేను గ్రహించాను. నేనా సంవత్సరమే ప్రభుత్వ క్వార్టర్స్‌లోకి మారి ఆ తర్వాత ఇంకో వూరు బదిలీ అయి - బొంబాయి నగరానికి మళ్లీ తిరిగి రానంత దూరం వెళ్ళిపోయాను. అక్కడి సంగతులెప్పుడన్నా ఉత్తరాల్లో వ్రాసే క్రిష్టాఫరూ చనిపోయాడు.

దాదాపు రెండు దశాబ్దాల పైనే - పాతికేళ్ల కాలం గడిచింది. నా మొదటి పుస్తకం అచ్చువేయించుకోటానికి డబ్బు కొరత అడ్డు. పని ఆగిపోయింది.

ఆ మధ్యాహ్నం నాకో రిజిస్టర్డ్ పోస్టులో కవరు వచ్చింది. అందులో ఐదువేల రూపాయలకు ఒక డిమాండ్ డ్రాఫ్టూ, ఇంగ్లీషులో గ్రామర్ తప్పుల్తో ఒక జాబు: "పాతికేళ్లక్రితం నాకో మేలు చేశారు మీరు. నేను అబద్ధం ఆడాను. అబద్ధం కాదు అసత్యం. తప్పు దిద్దుకొంటున్నాను. ఆ వస్తువు అమ్మివేశాను ఎప్పుడో. మీ చిరునామా యిప్పుడే లభించింది. ఇది నా పశ్చాత్తాపానికి పరిహారం - బరూచా"

# III

## భాస్కరన్-హవల్దార్

హవల్దార్ భాస్కరన్ నాయర్‌తో నా ప్రథమ పరిచయం కలకత్తా సియాల్దా రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం మీద. స్టేషన్ బయట మైదానంలో అసంఖ్యాకులైన అప్పటి తూర్పు పాకిస్తాన్ కాందిశీకులు. భూలోకపు విషాదం అంతా అక్కడే. నగరపు మురికి అంతా అక్కడే. బలహీనుల అర్తుల అభద్రత అంతా అక్కడే. ఆ బీభత్సాన్ని చూడలేక టాక్సీ దిగంగానే స్టేషన్‌లోకి వెళ్తున్నాను. భాస్కరన్ అంత పొద్దుటే నీళ్ల కొళాయివద్ద మంచినీళ్లు తాగుతున్నాడు. నాకు సైనిక పటాలాలతో వున్న సన్నిహిత పరిచయంతో పోల్చుకొన్నాను-కేరళనుండి ఇక్కడి దాకా ఒక్క రైల్వే వారంటుతోనే వచ్చి వుంటాడు. ఉన్న నాలుగు డబ్బులూ ఖర్చయిపోయాయి. నీళ్లతో కడుపునింపుకుంటున్నాడు.

అప్పటికి ఫరక్కా వద్ద రైల్వే లైను లేదు. గంగదాటాలి. న్యూ బొంగాయ్ గావ్ వద్ద మళ్లీ అస్సాం రైలుబండి పట్టుకోవాలి. అతను నాగాలాండ్. నేను గోహతి. నా సామాన్లు స్టీమర్‌దాకా మోసి నన్ను డెక్‌మీద కూచోబెట్టాడు. తన ఇంటి సంగతులు చాలా చెప్పాడు. సంస్కృతంతో మంచి పరిచయం వుంది. చిన్నతనంలో కథాకళి నృత్యం కొంత నేర్చాడు. పెద్ద కుటుంబం, సైన్యంలో చేరాడు. అతనితో సంభాషిస్తుంటే భవిష్యత్తు మీద విచారం ఉండదు. మా ప్రయాణం - ఇద్దరివీ వేర్వేరు రైల్వే తరగతులైనా ఆనందంగా నడిచిపోయింది. జంక్షన్లలో నాకు టీ తెచ్చి యిచ్చేవాడు. అతని ఆకలి నాకు గుర్తున్నది.

సరిగ్గా ఒకటిన్నర సంవత్సరాల తర్వాత మళ్లీ హౌరాలో తటస్థపడ్డాం. ఫోర్ట్ విలియంలో చీఫ్ ఇంజనీర్ ఆఫీసులో నాపని ముగించుకొని జీపు దిగి అస్సామ్ మెయిల్ నిలిచే చోటుకు హడావిడిగా పరుగెడుతున్నాను. "సార్, సార్..." అదే భాస్కరన్. ఈసారి ఇద్దరం దిమాపూర్ దాకా పయనించాలి. కాని అతని పరిస్థితి అదే. తమ్ముళ్లు చెల్లెళ్లకోసం. అతను చేస్తున్న త్యాగం దాచినా దాగని విత్తనం. ఇద్దరం రైల్వే యూరపియన్ రెస్టారెంటులో భోంచేసాం. బోగీలో నా బెడ్డింగు పరచి తను సెకండ్ క్లాస్ బోగీకి వెళ్లిపోయాడు. ప్రతికూడలి వద్దా నా క్షేమం కనుక్కోవాల్సిందే. బీహార్‌లో గట్టి పెరుగుముంతమీద పంచదార మస్తుగా చల్లించి తెచ్చేవాడు. పంచదార పాకం పల్లీ చెక్కలు అతనికి చాలా ఇష్టం. మర్నాడు గోహతిలో మధ్యాహ్న భోజనం.

తీన్‌సుకియా స్టేషన్‌లో మళ్లీ కలిసాడు. "సార్ ఇవ్వాళ మీ పుట్టినరోజు గదా" అన్నాడు. ఎంత జ్ఞాపకం! తీన్ సుకియా కిటకిటలాడుతున్నది. నేపాలీ కూలీలు వందల

సంఖ్యలో వున్నారు. ''సార్-ఇక్కడ మావూరి నాయర్ మంచి దోశెలు వేస్తాడు. దిగండి సార్'' అన్నాడు.

నాకు ఓపికలేదు. వద్దన్నాను. అతను వినిపించుకోలేదు. బలవంతంగా దిగాను. స్టేషన్ మూల నాయర్ దోసెల వాసనను బట్టి నడుచుకొంటూ పోతున్నాం.

వెనక పెద్ద పేలుడు. నేను దిగిన బోగీ, ఆ పక్క బోగి ఛిన్నాభిన్నమైపోయాయ్. నాగా విప్లవకారులు పెట్టిన బాంబులు.

''భాస్కరన్... ఇది నా పుట్టింరోజుగదా!'' అన్నాను-అక్కడ చిన్నాభిన్నమైన అమాయక నేపాలీల శవాలు చూడలేక.

## IV

### లక్ష్మిదేవమ్మ - అధ్యాత్మం

''లక్ష్మిదేవమ్మా-నువ్వేమీ భయపట్టం లేదుగదా?'' అని అమ్మ ప్రశ్నిస్తున్నది.

పుస్తకం నుండి దృష్టి మరల్చి ఆమెవైపు చూచాను.

''నాకేం భయంతల్లీ. మీరు లేరా? పంతులుగారి పలుకుబడిలేదా? ధనకోటమ్మగారి దణ్ణిలేదా? ఆపైన సుందరకాండ హనుమంతులు లేడా?'' అని ఆమె జవాబు.

చిన్నవాణ్ణి-అయినా ఆ సంభాషణలో ఏదో మార్మికవేదన. దాని వెనక ఒక సమాజం, ఒక చరిత్ర, ఒకవిధి విలాసం అన్నీ పెనవేసుకొని ఒక స్త్రీ రూపంలో నన్ను ఆలోచింపజేసిన లోకవృత్తాంతం. ఆ స్త్రీ లక్ష్మిదేవమ్మ. రాత్రి మా యింట్లో విందుకు పప్పురుబ్బుతూ, అధ్యాత్మ రామాయణ కీర్తనలో పల్లవి - ''ఇంతీ, చెంగల్వ బంతీ, చెలువలమేల్ బంతీ, గుణములదొంతీ'' ముగించి, అమ్మ ప్రశ్నకు సమాధానం యిచ్చి, అనుపల్లవి అందుకొన్నది-''శ్రీకాంతుడు గాకున్న ఖరదూషణాదుల నావంతలోన జంప''. సజీవ మహాచేతనంగా ఇల్లంతా కమ్ముకొనే ఆ సుమధుర గాత్రం మళ్లీ ఎక్కడా వినలేదు.

ధర్మవరందో, ఆరణిదో పట్టుచీరె పచ్చదనం, నిండు ముత్తయిదువ గంభీర నీరవ మూర్తిమంతం. తీరంలేని అమృతనదం వలె తొట్రుపాటు పడని స్థిత ప్రజ్ఞత. ఆమె వంటమనిషని ఎవరు పొరబడతారు? ఊరగాయలు పెడ్తున్నా అప్పడాలు వత్తుతున్నా, వడియాలు ఎండలో ఆరబోస్తున్నా ఆమె నిర్జల ఏకాదశీ ఉపవాసం

చేస్తున్నదని అనుమానం రాదు.

రెండవసారి గమనిస్తేగాని ఆమె సౌందర్యం కనిపించదు. పిన్ని చెబితేగాని ఆమె విషాదం తెలియదు.

భర్త టక్కరి, జూదరి, సోమరి. కూతుర్నీ భార్యనూ గాలికి వదిలి పలాయనం చిత్తగించాడు. చేసిపోయిన అప్పులన్నీ తన కాయకష్టంతో తీర్చింది. ఒంటరి జీవన పోరాటంతోనే కూతుర్ని చక్కగా చదివిస్తున్నది. పిల్లకు హిందీ పాఠాలు నెపంతో ఒక కామాంధుడు, భార్య పుట్టింటికి పోగానే పోగాలం కమ్మిన ఇంకొక ప్లీడరూ-అన్ని అల్లర్లనూ హనుమంతుడికి నివేదించి నిలిచినా, మా ధనకోటమ్మపిన్ని ఆ కామాతురులకు బుద్ధిచెప్పిన వైనం-ఆమె మాటల్లోనే వినాలి. తర్వాతెప్పుడో ఆమె ఆ ఊరు విడిచిపోయింది.

❖ ❖ ❖

అయినా కాలం ఆగదు. మా ఉమ్మడి కుటుంబం ఛిన్నాభిన్నమై, నాన్నగారి వ్యాపార హర్మ్యాలు కూలిపోయి, అప్పుల ఊబిలో కూరుకుపోయి, ఓడలు బండ్లయినపుడు, అమ్మ నగలు పోయి పసుపుతాడు తోడయినపుడు, పనిమనిషి చివరి జీతానికి అమ్మ తన కట్టుడు చీరెతోనూ, పాల నాగమ్మ బాకీకి నాన్నగారి ట్రంకు పెట్టెలతోనూ ఖాతాలు రద్దుచేసినప్పుడు, నా బడి జీతానికై గూడుగూడూ, మూలమూలా దేవుడి డబ్బాలు వెతికి కాన్లు, అణాలు, బేడలు కూడబెడ్తున్న తరుణాన - అమ్మ ముఖం చూచాను. కన్నీళ్లు చూడలేదు.

నన్ను తన వాడినిగా చేసుకొన్న ఆ పట్నం వదిలి మా గ్రామంతరలిపోతున్న తరుణాన అమ్మ మాటలు - "లక్ష్మిందేవమ్మ మరచెంబు మనింట్లోనే వున్నది-ఎట్లా మరిచిందో ఏమో. ఇదామెకు చేరే ఉపాయం కనిపించటంలేదు" అమ్మ ఆ మరచెంబు చేతబట్టుకొని బండిదాకా నడుస్తున్నది.

ఎదురుగా ఇంకో జట్కా బండినుండి లక్ష్మిందేవమ్మగారు దిగుతున్నది. చెంపలు తెల్లబడ్డ ముఖంలో అదే హాసం. అదే చల్లని చూపు. కాశీబోసి కట్టిన పట్టుచీరె.

"ఒక్కక్షణం తల్లీ. ఈ వరండాలో నిలబడు. నా కూతురి పెళ్లికి పీటల మీద కూచొన్న పుణ్యదంపతులు. నన్నాదరించిన తలిదండ్రులు. మీ కష్టం విన్నాను. పైనున్న వాడు కరుణిస్తాడు. నీ కొడుకు ప్రయోజకుడవుతాడు" అంటూనే అమ్మ చేతిలో మరచెంబు అందుకొని అందులో తన చేతిలోని చిన్న మూట - రాణీ మార్కు

రూపాయల మూట వేసి, అమ్మకు పళ్లెంలో పసుపూ కుంకుమా చీరె పెట్టి, నా బుగ్గలు పుణికి, మౌనంగా నాన్నగారి కాళ్లు తాకి మాయమైపోయింది. కాని ఈమారు ఆమె కన్నీరు చూచాను. ఆమె వైధవ్యం చూచాను.

❖❖❖

ఆమె ఆశీస్సులు వృధా కాలేదు. ఆమె మరచెంబు తర్వాత నాకు అక్షయపాత్రగా నిలిచింది. అమ్మా నాన్నా పోయారు. అంచెలంచలుగా నేను పెద్ద ఉద్యోగి నయ్యాను.

ఎన్నేళ్ల తర్వాతనో తిరుపతి కొండబాటను నడుస్తున్నప్పుడు ఒక వృద్ధురాలి అచంచల విశ్వాసంతో మళ్లీ దర్శనమిచ్చింది లక్షిందేవమ్మ. "నాయనా, మనవడి పెళ్లి కొండమీదనేనని మొక్కుకొన్నాను. డబ్బుకు కొదవలేదు. అంతా సుఖంగా వున్నారు. ఒక ముచ్చట చెప్పనా? అమ్మ పేర అన్నదాన విరాళం ఇవ్వాలనే సంకల్పం వుంది. నిన్ను చూచాను" అన్నదామె. ఎందుకీ కన్నీళ్లు?

✿ 'ఆంధ్రప్రభ వారపత్రిక' జన్మదిన సంచిక, 1996

"బాధలేని పాదముద్ర వేయలేదు
విషాదంలేని పాటలేవీ పాడలేదు"

-మునిపల్లెరాజు అరణ్యకాలనుండి